క్లుప్తంగా

కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

మంత్రాలయం రూరల్: ఈలనె 23 నుంచి 25వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో కర్నూలు జట్టు తరుపున మండలంలోని విద్యానగర్ తండా ఎస్ఎంకేవీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రాణి చిత్తూరు, ఈస్ట్‌గోదావరి జిల్లాల జట్టుపై విజయం సాధించడంలో రాణించి రజత పతకం సాధించింది. దీంతో రాణిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మాలధారణ



శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మాలధారణ గావిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : ఫిబ్రవరి 18న శివరాత్రి పండగను పురస్కరించుకుని పట్టణంలో అర్ధమండల శివమాలను స్వీకరించారు. రథసప్తమి సందర్భంగా శనివారం శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో దాదాపు 300 మంది భక్తులకు గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో మాలధారణ కార్యక్రమం జరిగింది. అలాగే పట్టణంలోని ఆయా శివాలయాల్లో మొత్తం వెయ్యి మందికి పైగా మాలధారణ గావించినట్లు గురుస్వాములు తెలిపారు. అనంతరం శంభులింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులకు నియమ నిబంధనల గురించి శైలేంద్రనాథ్ వివరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఆదోని రూరల్ : సెబ్ అధికారులు శనివారం జరిపిన దాడుల్లో మండలంలోని సంతేకూడ్లురు బస్టాప్ వద్ద అల్పానూరు గ్రామానికి చెందిన వి.నరసింహ అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామని సీఐ హరికృష్ణ తెలిపారు. నరసింహ తన స్కూటర్‌పై 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లను తీసుకెళ్తుండగా గుర్తించి అరెస్టు చేశామని చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

కౌతాళం: ఉపాధి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న కోరారు. ఈ మేకు శనివారం ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 8 వారాల ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన వేతనాలు చెల్లించలేదని, దీంతో కూలీలకు పూట గడవడం కష్టతరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుల ఆలస్యమైతే కూలీలకు వలసలకు తరలే అవకాశముందని, అధికారులు స్పందించాలని కోరారు. అధిక వర్షాల వల్ల పత్తి, మిరప, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పెట్టుబడి కూడా రాకపోవడంతో 10,15 ఎకరాలు భూములున్న రైతులు కూడ వలసలు పోతున్నారని, వెంటనే అధికారులు చర్యలు తీసుకొని పనులు కల్పించి, పెండింగ్ వేతనాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఉలిగయ్య, వీరేష్, వలి పాల్గొన్నారు.

సర్వేయర్‌కు సన్మానం



సర్వేయర్‌ను సన్మానించిన ఎంపీపీ, ఎంపీడీఓ

కోసిగి: స్థానిక సచివాలయం –5 కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ఓంకార్‌ను ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన పెండేకల్లు పొలంలో భూములు రీసర్వేను పకడ్బందీగా వేగంగా పూర్తి చేసినందుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఉద్యోగంలో చేరిన మూడేళ్ల లోపే ఉత్తమ సేవా పురస్కారం లభించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు మాణిక్యరాజు, సచివాలయ కన్వీనర్లు మహేంతేష్ స్వామి, బుడగజంగాల అయ్యప్ప, కొరివి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


పెద్దకడబూరు : మిరప రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు కోరా. మండల కేంద్రంలోని మిరప కల్లాల్లో ఆరబోసిన మిరప దిగుబడులను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణ ప్రభావం వల్ల పంటకు తెగుళ్లు సోకి దిగుబడి పడిపోయిందని, దీంతో రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి హనుమంతు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు పాల్గొన్నారు.

వాల్మీకులు తరలి రావాలి

కోసిగి: ఈనెల 30వ తేదీన వాల్మీకుల సమస్యల అధ్యయనం చేసేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐ.శ్యామ్యుల్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో వన్ మ్యాన్ కమిషన్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా వాల్మీకులు తరలి రావాలని కోసిగి నవ సంకల్పం అధ్యక్షుడు నాగరాజు, హొళగుంద కోసిగయ్య, అంజి, ముకుంద కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కమిషన్ సోమవారం కర్నూలు జిల్లా పరిషత్ ఆవరణలో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌పై చర్చిస్తారని తెలిపారు. వాల్మీకులు తరలివచ్చి ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో కలపాల్సిన ఆవశ్యకత గురించి వివరించి వినతి పత్రాలు అందజేద్దామని కోరారు.నాయకులు తిక్కయ్య, ఈరన్న పాల్గొన్నారు.

తగ్గిన వలసలు


- 2014–2019తో పోల్చితే తగ్గుముఖం
- సంపాదన కోసమే వెళ్తున్న వైనం
- కల్పతరువుగా మారిన 'పులికనుమ'
- ముందస్తుగానే మొదలైన ఉపాధి పనులు, సీజనల్ హాస్టళ్లు
- ఆరు ఎత్తిపోతల పథకాలతో 9,445 ఎకరాలకు సాగునీరు



నీటితో నిండుగా పులికనుమ రిజర్వాయర్



సీజనల్ హాస్టల్‌లో భోజనాలు చేస్తున్న విద్యార్థులు



చింతకుంట గ్రామ సమీపంలో మిరప కోతల్లో నిమగ్నమైన కూలీలు

మంత్రాలయం : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వర్షాధార పంటలు ముగియగానే వలసల వెళ్లడం కొనసాగుతోంది. గతంలో నీటి వనరులు లేక వ్యవసాయ అంతంత మాత్రమంగానే ఉండటం, స్థానికంగా పనులు లేక నెలల తరబడి ఇతర ప్రాంతాలకు తరలివెళ్లేవారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా ఉండటం, ఉపాధి పనులు ముందుగానే కల్పిస్తుండటంతో దాదాపు వలసలు తగ్గుముఖం పట్టాయి. అయితే కొందరు అదనపు సంపాదన కోసం నగరాలకు తరలివెళ్తున్నారు. వారంతా ఏటా వెళ్తుంటారు కూడా. గతంతో పోలిస్తే వలసలు దాదాపుగా తగ్గాయని రైతులు, అధికారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో వలసల నివారణకు ప్రభుత్వం చేస్తున్న ముందస్తు కృషి హర్షనీయమని రైతులు, రైతు కూలీలు అభినందిస్తున్నారు.

సస్యశ్యామల యజ్ఞం..

మెట్ట భూముల్లో సిరులు పండించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించింది. తుంగభద్ర నదీ జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు శ్రీకారం చుట్టింది. టీడీపీ ప్రభుత్వంలో కంటే ప్రస్తుతం ఎత్తిపోతల పథకాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నియోజకవర్గంలో 6 ఎత్తిపోతల పథకాలను నిర్మంచతలపెట్టారు. వీటిని రూ. 73.94 కోట్లతో ఏర్పాటు చేసి 9,445 ఎకరాలకు సాగునీరందించనున్నారు.

మొదలైన సీజనల్ హాస్టళ్లు..

గత ప్రభుత్వాలు వేసవి సెలవుల్లో మాత్రమే విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసేవి. కానీ వలసల నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం మాత్రం మూడు నెలల ముందే సీజనల్ హాస్టళ్లను ప్రారంభించింది. పొదుపు సంఘాలతో హాస్టళ్ల ఏర్పాటుకు పూనుకుంది. జిల్లాలో 71 సీజనల్ హాస్టళ్లు ఉండగా నియోజకవర్గంలో 9 హాస్టళ్లను ప్రారంభించారు. విద్య కుంటుపడకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా వీటిని తెరిచారు. ఇప్పటికే కోసిగిలో 4, మంత్రాలయంలో 3, కౌతాళం, పెద్దకడబూరు ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. వీటిల్లో మూడు పూటల అల్పాహారం, భోజనాలు వడ్డిస్తున్నారు. తల్లిదండ్రులు వలస వెళ్లినా విద్యార్థులకు ఎలాంటి ఆటంకం ఉండరాదని ఏర్పాటు చేశారు.

ఎత్తిపోతల పథకాలు, నిధుల కేటాయింపు, సాగులోకి రానున్న భూమి వివరాలు..

మండలం	ఎత్తిపోతల పథకం	నిధులు (రూ..)	ఆయకట్టు
మంత్రాలయం	52–బసాపురం	10.42 కోట్లు	1,455 ఎకరాలు
మంత్రాలయం	ఖగ్గల్	6.90 కోట్లు	495 ఎకరాలు
కోసిగి	ఐరన్‌గల్	18.52 కోట్లు	1,515 ఎకరాలు
కోసిగి	కందకూరు	11.95 కోట్లు	1,170 ఎకరాలు
కోసిగి	కోసిగి	4.80 కోట్లు	2,500 ఎకరాలు
కౌతాళం	గోతులదొడ్డి	21.25 కోట్లు	2010 ఎకరాలు
మొత్తం	6 పథకాలు	73.94 కోట్లు	9,445 ఎకరాలు

ముందస్తు ఉపాధి

ఇంతకు ముందు ప్రభుత్వాలు వేసవిలో మాత్రమే ఉపాధి పనులు కల్పించేవారు. అయితే వలసలు నివారించాలని ఈ ఏడాది ముందస్తుగానే ప్రభుత్వం ఉపాధి పనులు ప్రారంభించింది. ప్రస్తుతం నాలుగు మండలాల్లో రోజూ 6 వేల మందికిపైగా కూలీలు పనులకు హాజరవుతున్నారు. దాదాపు 8 లక్షల పనిదినాలు కల్పించగా మరో 5 లక్షల మేర పనిదినాలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని అధికారులు చెబుతున్నారు.

గతంతో పోల్చితే తగ్గుముఖం..

టీడీపీ ప్రభుత్వ హయాంలో వానల్లేక, స్థానికంగా పనుల్లేక ఊళ్లకు ఊళ్లు వలస వెళ్లిన సందర్భాలు కోకొల్లలు. వ్యవసాయ కూలీలతోపాటు రైతులు సైతం సుగ్గికి వెళ్లేవారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురవడం, పంటలకు మంచి గిట్టుబాటు ధరలు ఉండటంతో రైతులు వలస మానుకున్నారు. కొందరు ఏటా వెళ్లడంలో భాగంగా వలస వెళ్లడం అలవాటుగా చేసుకున్నారు. ఇంకొందరు నాలుగు డబ్బులు పోగేసుకునేందుకు తరలిపోతున్నారు. గతంతో పోలిస్తే ఈ మూడేళ్లలో వలసలు భారీగా తగ్గాయని రైతులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లోని పొలాల్లో పనులు జోరుగా సాగుతున్నాయి.

వలసలపై నానా యాగీ



ఇప్పుడే వలసలు మొదలైనట్లు, చాలా ఎక్కువగా ఉన్నట్లు పచ్చమీడియా టీడీపీతో కలిసి యాగీ చేస్తోంది. నిజంగా తమ హయాంలో వలసలు దాదాపు తగ్గాయనేది వాస్తవం. వలసల నివారణ కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా నియోజకవర్గానికి 6 ఎత్తిపోతల పథకాలను మంజూరు చేశారు. దాదాపు రూ.74 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. త్వరలో దాదాపు పదివేల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నాం. ముందస్తు చర్యగా సీజనల్ హాస్టళ్లు, ఉపాధి పనులు సైతం ప్రారంభించాం. ఇవేమీ పట్టించుకోని టీడీపీ నాయకుల విమర్శలకు ఆయా చానళ్లు, పేపర్లు వంతపాడటం శోచనీయం.
– వై.బాలనాగిరెడ్డి, శాసనసభ్యులు, మంత్రాలయం

70 శాతం వలసలు తగ్గాయి



కోసిగి మండలంలో వలసలు వెళ్తున్నారంటూ మీడియా ఎక్కువగా చూపుతోంది. గతంతో పోలిస్తే మండలంలో వలసలు దాదాపు తగ్గాయి. మూడేళ్లగా మంచి వానలు బాగా కురవడంతో రైతులు వలస వెళ్లడం మానేశారు. స్థానికంగానే వ్యవసాయ పనులు చేసుకుంటూ కూలీలకు పనులు కల్పిస్తున్నారు. 70 శాతం వరకు వలసలు తగ్గాయి. పులికనుమ ప్రాజెక్టు నిర్మించి వైఎస్సార్ ఎంతో మేలు చేశారు. – శ్రీనివాసరెడ్డి, ఐరన్‌గల్లు

వలస వెళ్లడం లేదు



టీడీపీ హయాంలో పొలాలు వదిలేసి వలస వెళ్లే వాళ్లం. ఇంటిల్లిపాది సుదూర ప్రాంతాలకు సుగ్గికి వెళ్లి కష్టపడ్డాం. గత మూడేళ్లుగా వలస వెళ్లడం లేదు. నాకున్న ఎకన్నర పొలంలో మిరప పంట వేసుకున్నా. పంట బాగానే ఉంది. మంచి ధర లభిస్తుండటంతో కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే గట్టెక్కుతున్నాం. మా ఊరిలో గతంలో కంటే వలసల బాగా తగ్గాయి. పులికనుమ రిజర్వాయర్ ఉండటంతో భూగర్భ జలాలు బాగా పెరిగాయి. మా ఊరోళ్లు బాగానే పంటలు పండించుకుంటున్నారు. – చింతలయ్య, చింతకుంట

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



అగసలదిన్నెలో ప్రత్యేక అలంకరణలో అంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి , అగసలదిన్నెలోని ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు. బుడుములదొడ్డి అంజనేయస్వామి దేవాలయంలో సీతారాములకు విశేష పూజల అనంతరం ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి దేవాలయపు చుట్టూ రథాన్ని లాగారు.

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారికి శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళారతి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి

- కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ బోయ శాంత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని అర్బన్ : పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్లు కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాలులో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలోని 23 అంశాలను ఆమోదించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలో రోడ్లు వెడల్పు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పారిశుద్ధ్య లోపం వల్ల శివారు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థానికులు చెబుతున్నా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు బాలాజీ మాట్లాడుతూ వ్యాపార సముదాయాలకు ట్యాక్స్ తగ్గిస్తున్నారో చెప్పాలని రెవెన్యూ ఆఫీసర్ అస్లాంబాషాను ప్రశ్నించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ చలపతి అభ్యర్థించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు నరసింహులు, మహ్మద్‌గౌస్, కౌన్సిలర్లు లోకేశ్వరి, కీర్తన, వసీం, రాజేశ్వర్‌రెడ్డి, ఇంతియాజ్, పద్మా, లక్ష్మిదేవి, మహాలక్ష్మి, సురేష్, ఉస్మాన్, కో–ఆప్షన్ మెంబర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పరిశీలన



పనుల వివరాలను తెలుసుకుంటున్న హౌసింగ్ పీడీ వెంకట నారాయణ

ఆదోని అర్బన్ : పట్టణంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను హౌసింగ్ పీడీ వెంకటనారాయణ శనివారం పరిశీలించారు. పనులపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నీటి సౌకర్యం లేకపోవడంతో సంబంధిత అధికారులు పైపులైన్లు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్, హౌసింగ్ ఈఈ ప్రసాద్, ఏఈ ఆదినారాయణ, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ కేతన్ పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్ సందర్శన

ఆదోని అర్బన్ : పట్టణానికి చెందిన ఆర్ట్ కళాకారుడు శ్రీకాంత్ ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌ను సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ శనివారం సందర్శించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో చేతితో గీసిన, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను ప్రదర్శించారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ సందర్శించి యువకుడిని అభినందించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తనకు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను గీయడం ఇష్టమని చెప్పారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద సంస్థకు అందజేయనున్నామని చెప్పారు.



ఆర్ట్ గ్యాలరీని తిలకిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సాయి



వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాంత్రికి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధి పొందిన తీరును ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, రైతులకు ప్రాధాన్యతనిస్తోందని, మిగిలిన వాటిని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఆయా రంగాల్లో ఎన్నడూ లేనంత ప్రగతి చేసి చూపారని, విద్య, వైద్యం విధానాన్ని పూర్తిగా ప్రక్షాళించి మెరుగైన సేవలందేలా వసతులు, యంత్రాలు, సాంకేతికతను సమకూర్చారని చెప్పారు. 104,108 ను ఆధునికంగా తీర్చిదిద్ది మరింత మెరుగ్గా నిర్వహిస్తూ ఆపత్కాలంలో బాధితులకు మెరుగైన సేవలందించేలా అమలు చేస్తున్నారు. మూగజీవాలకు సైతం ఉన్నచోటే వైద్యసౌకర్యాలను అందించేందుకు సంచార పశు వాహనాలను అమలులోకి తెచ్చారన్నారు. 1962కు కాల్ చేస్తే పశువుల వద్దకే వాహనం ద్వారా పశువైద్య సిబ్బంది వచ్చి చికిత్స అందిస్తారన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం అందించని పథకాలను సీఎం జగన్ అందిస్తున్నాడని వివరించారు. ఆయన పాలన పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తుంటే ఓర్వలేక చంద్రబాబునాయుడు ఆయన దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. యువత అలాంటి వారి మాటలు నమ్మి సంక్షేమం, అభివృద్ధిని కోల్పోరాదని సూచించారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, ఎంపీడీఓ గీతావాణి, సర్పంచ్ బసవరాజ్, నాయకులు గిడ్డయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శనివారం మాంత్రికి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద మంజూరైన రూ.50 లక్షలతో సంపు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మాంత్రికి, కొత్తూరు గ్రామాలు రెండూ గతంలో ఒకే పంచాయతీలో ఉండేవన్నారు. ఇటీవల కొత్తూరు వేరే పంచాయతీగా విడిపోవడం వల్ల మాంత్రికి గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. దీంతో సమస్య పరిష్కారం కోసం సంపు నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు.



సంపు నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నీటి సమస్యకు పరిష్కారం



ఏరిగేరిలో బోరు వేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఏరిగేరి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. ఈ మేరకు శనివారం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద రెండు బోర్లు వేశారు. ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ గోవిందు మాట్లాడుతూ సాయిబాబ దేవాలయం వద్ద, పులిగట్టు ఆంజినేయస్వామి ఆలయం రోడ్డులో వేసిన రెండు బోర్లలో తాగునీరు పడ్డాయని, ఈ నీటితో గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు.

'నాడు–నేడు' ఫొటోలు అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

ఆదోని అర్బన్ : ప్రతి సోమవారం నాడు–నేడు పనులకు సంబంధించిన భౌతిక ప్రగతిని తెలియజేసే ఫొటోలను ఇంజినీరింగ్ సహాయకులు తమ మొబైల్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని సమగ్రశిక్షా పథక జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రెవెన్యూ డివిజన్‌లోని మండలాలకు చెందిన ఎంఈఓలు, మండల ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 131 పాఠశాలల్లో 202 పనులు సకాలంలో జరగలేదని, దీనికి తగిన కారణాలను విశ్లేషిస్తూ వాటికి తగిన పరిష్కారాలను తెలియజేసి అమలు చేయాలన్నారు. ఎమ్మిగనూరు, నందవరం మండలాల్లో పనులు చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయని, నిధులు అందుబాటులో ఉన్న మండలాల్లో వాటిని ప్రణాళికాబద్ధంగా పనులు చేయిస్తూ సంబంధిత బిల్లులను హెచ్ఎంలతో అప్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. ఫొటోలను తీయడంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే రాతపూర్వకంగా ఇచ్చి తగిన పరిష్కారాలతో పని పురోగతి చూపాలని కోరారు. పంచాయతీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంజినీరింగ్ సహాయకుల పని వివరాలు, సమయపాలన, ఇతరులతో సమన్వయం ఎలా చేసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ఈఓ సుకుమార్ మాట్లాడుతూ ఎంఈఓలు అందరినీ సమన్వయం చేసుకుని నిధుల వినియోగం పూర్తి చేయాలని సూచించారు. సమగ్రశిక్షా ఈఈ కరెన్న, డివిజన్ పరిధిలోని ఇంజినీర్లు, డీఈలు, ఏఈలు, అలెస్కో కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, జీసీడీఓ సునీత, టెక్నికల్ సహాయకులు హరినాథ్, నాడు–నేడు టీం సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఆదోని అర్బన్ : రథ సప్తమి సందర్భంగా శనివారం స్థానిక తిరుమలనగర్‌లో వెలిసిన శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస, పద్మావతి అమ్మవార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. శ్రీ భద్రావతి భావనరుషి పద్మవంశీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా వేడుక నిర్వహించారు. కల్యాణం సందర్భంగా సంఘం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.



ప్రధాన రహదారుల్లో భక్తుల నడుమ సాగుతున్న ఊరేగింపు



గరుడ వాహనంపె విహరిస్తున్న వేంకటేశ్వరుడు

వైభవంగా గరుడ వాహన సేవ

- గోవింద నామస్మరణతో మార్మోగిన పట్టణ ప్రధాన రహదారులు
- గరుడ వాహనంపై పురవీధుల్లో విహరించిన శ్రీవారు
- తరలివచ్చిన భక్తులు

ఆదోని అర్బన్ : అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా.. ఏడు కొండలవాడా.. వెంకటరమణ గోవిందా.. గోవిందా.. అనే నామస్మరణతో పట్టణంలోని ప్రధాన రహదారులు మార్మోగాయి. రథసప్తమి సందర్భంగా శనివారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి భక్తజన బృందం ఆధ్వర్యంలో శ్రీవారి గరుడ వాహనసేవ ఊరేగింపు కనుల పండువగా జరిగింది. ఈ ఉత్సవం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారుల గుండా ఎంఎం రోడ్డు, బంగారు బజార్ మీదుగా నగరేశ్వరస్వామి ఆలయం, శ్రీకోట వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవం ముందు మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణ వాసులు భారీగా తరలిరావడంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. భక్తబృందం, ఎమ్మెల్యే తనయుడు జయ మనోజ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

ఆదోని అర్బన్: స్థానిక మున్సిపల్ ఉన్నతపాఠశాల, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులకు శనివారం 'ఏ' సర్టిఫికెట్ పరీక్షలు జరిగాయి. కార్యక్రమానికి వన్ ఆంధ్ర మెడికల్ గ్రూప్‌నకు సంబంధించిన ఎన్‌సీసీ అధికారులు అశోక్‌కుమార్, రాయుడు, ఎంపీదింబారే పాల్గొని వంద మంది విద్యార్థులకు డ్రిల్ టెస్ట్, మార్చ్‌ఫాస్ట్ తదితర పరీక్షలు నిర్వహించారు.

నిందితుడి అరెస్ట్

ఆదోని రూరల్ : మండలంలోని కపటి గ్రామంలో మతిస్థిమితంలేని ఓ యువతిపై అత్యాచారానికి యత్నించిన రాముడు అనే వ్యక్తిపై ఈనెల 19న కేసు నమోదైందని ఇస్వీ పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడు రాముడిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని పోలీసులు చెప్పారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన


బిల్వార్చన చేసిన దృశ్యం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ప్రభాకర్ టాకీస్ పక్కనున్న శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పండగను పురస్కరించుకుని శివమాల దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో బుధవారం లక్ష బిల్వార్చన పూజలు చేశారు. గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో బిల్వాలతో అర్చన చేసి శంభులింగేశ్వరస్వామికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అంతకుముందు స్వామివారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, పూల అలంకరణ, పడిపూజ, మహామంగళహారతి తదితర పూజలు చేపట్టారు.

పట్టుబడిన కర్ణాటక మద్యం దహనం


కర్ణాటక మద్యాన్ని దహనం చేస్తున్న రైల్వే పోలీసులు

ఆదోని టౌన్: ఆదోని రైల్వేస్టేషన్ పరిధిలో కర్ణాటక నుంచి అక్రమంగా రైళ్లలో తరలిస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని బుధవారం రైల్వేస్టేషన్ ఆవరణలో దహనం చేశారు. రైల్వే ఎస్ఐ రామస్వామి, గుంతకల్ రైల్వే డీఎస్పీ, సెబ్ ఎస్ఐ ఆధ్వర్యంలో పట్టుబడిన ఏడు కేసుల్లో 4,357 టెట్రా 90 ఎం.ఎల్. ప్యాకెట్లను దహనం చేశారు. వాటి విలువ దాదాపు రూ.1.90 లక్షలు దాకా ఉంటుందని పోలీసులు తెలిపారు.

రేపు వాహనాల వేలం

ఆదోని రూరల్ : ఆదోని సెబ్ స్టేషన్‌లో ఈనెల 3వ తేదీన నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వాహనాల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆటోలు, మోటార్ సైకిళ్లు ఉన్నాయని, ఆసక్తి గల వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు స్థానిక సెబ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బాలికలను రక్షిద్దాం


విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : బాలికలను రక్షిద్దాం, బతకనిద్దాం, చదవిద్దామని సీడీపీఓ నిర్మలాదేవి అన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయకుండా వారిని బాగా చదివించాలని సూచించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివలింగమ్మ, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలిన మట్టి కుండల బట్టీ

కోసిగి: మండల కేంద్రంలోని సిద్దప్ప పాలెంలో నివాసం ఉంటున్న కుమ్మరి యంకప్పకు చెందిన మట్టి కుండల బట్టీ ప్రమాదవశాత్తు కూలిపోయింది. అందులో దాదాపు 20 రోజుల నుంచి తయారు చేసి ఉంచిన కుండలన్నీ పగిలిపోయాయని బాధితుడు వాపోయాడు. వాతావరణం సరిగా లేక పోవడంతో బట్టీ ఉన్నటుండి కూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం కుండలు కాల్చేందుకు కట్టెలు దొరకడం కష్టంగా మారిందని చెప్పాడు.

మాజీ సైనికుడు మృతి


వీరేష్ (ఫైల్)

కోసిగి: స్థానిక శ్రీరామ టాకీస్ సమీపంలో నివాసం ఉంటున్న బోయ వీరేష్ (45) అనే మాజీ సైనికుడు గుండె పోటుకు గురై కొద్దికాలంగా ఆదోనిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆయన జమ్మూకాశ్మీర్‌లో జవాన్ సేవలు అందించాడు. రెండేళ్ల క్రితం వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని కోసిగిలో నివాసం ఉంటున్నాడు. నెల క్రితం గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆయనకు భార్య గోవిందమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ


మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్: రూరల్ సీఐగా కె.మోహన్‌రెడ్డి బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ బీపీ మంజునాథ్ కర్నూలు త్రీ టౌన్‌కు బదిలీ కాగా ఆ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు సీఐగా కె.మోహన్‌రెడ్డిని పోలీస్ ఉన్నతాధికారులు నియమించారు. నూతన సీఐకు ఎస్ఐ సునీల్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం

వ్యాపారులు, కూలీలు, హమాలీల తీరుతో ఆదోని మార్కెట్ యార్డుకు రైతులు దిగుబడులు తీసుకొచ్చేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా గతంలో ఈ సీజన్‌లో వేరుశనగ దిగుబడులు రోజుకు 25వేల నుంచి 30వేల సంచులు వచ్చేవి. ప్రస్తుతం 300–600 సంచులకు పరిమితమయ్యాయి. కొనుగోలుదారులు పాసింగ్ పేరుతో వేధింపులు, టెండర్‌ఫాం పూర్తయినా ఖాళీ సంచులివ్వకపోవడం, 20 కేజీల వరకు అదనంగా ఇచ్చుకోవాల్సి రావడంతో పాటు ఒక రోజుకు పైగా ఉండాల్సి వస్తోంది. అయితే వీటికి భిన్నంగా, రైతులకు అనుకూలంగా వ్యవహరిస్తుండటం, ఒక్క రోజులోనే విక్రయించుకుని వెళ్తుండటంతో ఎమ్మిగనూరు యార్డుకు దిగుబడులు పోటెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.


వేరుశనగ దిగుబడులు లేక బోసిపోతున్న ఆదోని మార్కెట్ యార్డు

- టెండర్ ఫారం వచ్చినా.. ఆలస్యంగా ఖాళీ సంచుల అందజేత
- ఖుషీ పేరుతో కూలీలు, హమాలీల దోపిడీ
- పాసింగ్ పేరుతో కొనుగోలుదారుల వేధింపులు
- వేరుశనగ రైతులకు తప్పని కష్టనష్టాలు
- ఎమ్మిగనూరుకు దిగుబడులను తరలిస్తున్న అన్నదాతలు
- వెలవెలబోతున్న ఆదోని యార్డు
- ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోని అధికారులు

ఆదోని అర్బన్ : వ్యవసాయ దిగుబడుల క్రయ, విక్రయాలకు ఎంతో ఖ్యాతిగాంచిన ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డు రోజురోజుకు ప్రాభవం కోల్పోతోంది. వేరుశనగ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు కష్టనష్టాలు తప్పడం లేదు. రైతులను ఓ వైపు వ్యాపారులు దోచుకుంటుండగా మరోవైపు హమాలీలు, కూలీల ఖుషీ పేరుతో దోపిడీకి పాల్పడుతుండటంతో వారు నష్టపోతున్నారు. యార్డులో వేరుశనగ దిగుబడులు ఉదయం 8 గంటలకు ఎండకు పోస్తారు. అయితే.. సాయంత్రం 4;30 గంటల వరకు కూడా కాటా వేయడం లేదు. ఎండకు ఎండి తూకం తగ్గాలని వ్యాపారులు దిగుబడులను నింపేందుకు ఖాళీ సంచులను ఆలస్యంగా ఇస్తున్నారు. ఇక పాసింగ్ పేరుతో వంకలు పెడుతున్నారు. వ్యాపారుల తీరుతో రైతులు స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు చీకటి పడడంతో రవాణా సౌకర్యాలు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే హమాలీలు ఖుషి పేరుతో ఏడు నుంచి పది కేజీల వేరుశనగలను బలవంతంగా తీసుకుంటున్నారు. మహిళా కూలీలు కూడా తమకు వేరుగా ఇవ్వాల్సిందేనని దాదాపు ఎనిమిది కేజీల వరకు తీసుకుంటున్నారు. చివరకు మంచినీళ్లు ఇచ్చేవారు.. తమకు ఇవ్వరా అంటూ ఐదు కేజీల వరకు దండుకుంటున్నారు. ఇలా మొత్తం 20 కేజీల వరకు రైతులు నష్టపోతున్నారు. వారి తీరు నచ్చక 80 శాతం మంది రైతులు ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డుకు దిగుబడులను తరలిస్తున్నారు. గతంలో ఈ యార్డుకు ఈ సీజన్‌లో రోజూ 25 వేల నుంచి 35 వేల సంచుల వరకు వేరుశనగ దిగుబడులు వస్తుండేవి. ప్రస్తుతం 300 నుంచి 600 సంచులకే పరిమితమయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. యార్డు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల రైతులు నష్టపోవడంతో పాటు యార్డు ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

ఎమ్మిగనూరు యార్డులో ఇలా..

ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో ఉదయం 8;30 గంటలకు వేరుశనగ దిగుబడులను ఆరబోస్తే టెండర్ ఫారం వచ్చిన వెంటనే కాటా వేసి నింపేస్తారు. పాసింగ్ పేరుతో వేధింపులు ఉండవు. ఒకవేళ గింజల్లో రాళ్లు, రప్పలు, ఇసుక ఉన్నా వ్యాపారులు టెండర్ వేసేటప్పుడే జాగ్రత్త పడి ధర వేస్తారు. ఖాళీ సంచులు కూడా టెండర్ ఫారం వచ్చిన వెంటనే ఇచ్చేస్తారు. సాయంత్రం 5 గంటల కల్లా రైతులు వేరుశనగ దిగుబడులను అమ్ముకుని మొత్తాన్ని తీసుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. అలాగే ఆదోని యార్డులో మాదిరిగా 20 కేజీల దోపిడీ లేదు. దీంతో ఎమ్మిగనూరు యార్డుకు వేరుశనగ దిగుబడులు పెరుగుతున్నాయి.

ఎమ్మిగనూరుకు వ్యాపారులు..

వేరుశనగల దిగుబడులు పూర్తిస్థాయిలో రాక తగ్గడంతో ఆదోనిలో ఉన్న వ్యాపారులు ఎమ్మిగనూరుకు వెళ్లి కొని తీసుకొస్తున్నారు. ఆదోని యార్డులో కొనుగోలు చేస్తే నేరుగా దిగుబడులు ఫ్యాక్టరీలకు వెళ్తాయి. అయితే ఎమ్మిగనూరుకు వెళ్లి సరుకు కొనుగోలు చేయడంతో అక్కడి నుంచి ఆదోనికి లారీ బాడుగ, అక్కడున్న వారికి కమీషన్ అందజేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా వేరుశనగ సంచులు ఎత్తేటప్పుడు పడిపోవడం వల్ల తూకాలు తక్కువ రావడం వల్ల వారికి నష్టం వస్తుంది. అయినా వారి తీరు మారడం లేదు.

యార్డుకు రైతులు రావడం లేదు



ఆదోని మార్కెట్‌యార్డులో వేరుశనగ రైతులు పాసింగ్ సమస్య, ఖాళీ సంచులు ఆలస్యంగా ఇస్తున్నారని, కూలీల వేధింపులతో రావడం లేదు. ఎమ్మిగనూరులో అయితే ఇలాంటివి ఏమీ లేవు. అందుకే దిగుబడులన్నీ ఎమ్మిగనూరుకే వెళ్తున్నాయి. యార్డులో కమీషన్ ఏజెంట్లు పెట్టుబడులకు ఇచ్చి తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే యార్డు ఆదాయానికి గండి పడుతోంది. అధికారులు స్పందించాలి.

– వీరభద్రగౌడ్, కమీషన్ ఏజెంట్ కార్యదర్శి

వ్యాపారులకు చెబుతున్నాం



ఖాళీ సంచులు త్వరగా ఇవ్వాలని, ముందుగానే గిట్టుబాటు ధర వేసుకోవాలని చెబుతున్నాం. యార్డు ఆదాయానికి గండి పడితే చర్యలు తీసుకుంటామని ఇదివరకే హెచ్చరించాం. అయితే ఈ ఏడాది క్రాప్ ఫెయిల్ అయ్యిందని, ఎక్కువగా పత్తి సాగు చేసుకున్నారని వేరుశనగ వ్యాపారులు చెబుతున్నారు. తమకు నష్టం కలిగించే వాటిపై రైతులు తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్‌రెడ్డి, యార్డు కార్యదర్శి

నివారణ చర్యలు ఇలా..

ఆదోని మార్కెట్‌యార్డుకు గత వారం నుంచి రోజుకు 300 నుంచి 400 క్వింటాళ్లు వేరుశనగ కాయలు వస్తున్నాయి. ఎమ్మిగనూరు యార్డుకు గత వారం నుంచి 3 వేల క్వింటాళ్ల నుంచి 11 వేల క్వింటాళ్ల వరకు క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. యార్డుకు ఆదాయం, రైతులు నష్టపోకుండా, త్వరగా స్వగ్రామానికి వెళ్లేలా చర్యలు చేపట్టడం అధికారుల చేతుల్లోనే ఉందని కమీషన్ ఏజెంట్లు పేర్కొంటున్నారు. టెండర్ అయిన వెంటనే ఖాళీ సంచులు ఇవ్వాలని, పాసింగ్ బదులుగా ముందుగానే గిట్టుబాటు ధర టెండర్ వేసుకునేలా చర్యలు తీసుకోవాలి. అలాగే మారిన పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పిస్తే యార్డు ఆదాయం పూర్వపు స్థితికి చేరుకునే అవకాశం ఉంటుంది.

పరీక్షలపై దృష్టి సారించండి


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

మంత్రాలయం రూరల్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై దృష్టి సారించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని చిలకలడోణ గ్రామ శివారులోనున్న కస్తూర్బా, మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ మోహీనుద్దీన్‌ను ఆదేశించారు.అంతకు ముందు చిలకలడోణ కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం సుంకేశ్వరి గ్రామానికి చేరుకుని వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవడంతో సదరు భూమిని పరిశీలించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ప్రభావతి ఉన్నారు.

మడివాల మాచిదేవ జయంతి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న వై.ప్రదీప్‌రెడ్డి


కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలో రజకుల ఆధ్వర్యంలో మడవాల మాచిదేవ జయంతి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక అంజనేయ స్వామి ఆలయం నుంచి స్వామి వారి చిత్రపటాన్ని ఆర్టీసీ బస్టాండ్ మీదుగా గ్రామోత్సవం చేపట్టారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి ఉన్నారు.

కౌతాళం: మడివాల మాచయ్య జయంతి ఉత్సవాలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివప్పనగర్‌లోని మాచయ్య దేవాలయం నుంచి ఊరేగింపు గ్రామ వీధుల్లో ఊరేగించారు. తెల్లవారు జామున సుప్రభాతసేవ, అభిషేకం మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఘనంగా దుర్గమ్మ దేవర


భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం


ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ దేవి

కోసిగి: మండలంలోని మూగలదొడ్డి గ్రామ దేవత దుర్గమ్మ దేవి దేవర ఘనంగా జరిగింది. బుధవారం వేకువజాము నుంచి అమ్మ వారిని కుంకుమార్చన, వెండి కవచ అలంకరణ, మహా మంగళహారుతులు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రతి ఇంటి నుంచి నైవేద్యం వండి కుంభంలో ఉంచుకొని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో రాత్రి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ ఎరిసా వలి, ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు.

రైతులను ఆదుకోవాలి

పెద్దకడబూరు : రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, ఏఐకేఎస్ తాలుకా కార్యదర్శి మబ్బు అంజనేయ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వీరేంద్రగౌడ్ సమక్షంలో రైతు డైరీలను అవిష్కరించారు. వారు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన వారిని ఆదుకోవాలన్నారు. మండల రైతులకు పులికనుమ ప్రాజెక్టు నుంచి పంటలకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి జగనన్న కాలనీల ప్రారంభం

మద్దికెర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలను ఉగాది నాటికి ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని మద్దికెర, పెరవలి, యడవలి తదితర గ్రామాల్లో జగనన్న కాలనీలను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటే సకాలంలో బిల్లులు మంజూరు, నీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని విషయాలను లబ్ధిదారులకు చెప్పాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగరాజు, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నందవరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–4లో గర్భిణులు, బాలింతలు, తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని రం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు సక్రమంగా అందించాలన్నారు. అలాగే గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవిభూదేవి సహిత శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ధ్వజ అవరోహణ, తుంగభద్ర నదిలో చక్రస్నానంతో ఉత్సవాలు పూర్తి అయ్యాయి. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కె మనోహర రావు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను రూపుమాపాం


ప్రభుత్వ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్
- నాగనాథనహళ్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆదోని రూరల్ : అన్ని రంగాల్లో దళారీ వ్యవస్థను రూపుమాపిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం కూడా ఆయనేనని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో రెండో రోజూ బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వారికి తెలియజేసి పొందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారన్నారు. 95 శాతానికి పైగా హామీలను నెరవేర్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, నాయకురాళ్లు శ్రీలక్ష్మి, మంజుల, రేణుక, ఈఓపీఆర్డీ జనార్దన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, సర్పంచ్ వరదప్ప, వైస్ ఎంపీపీ నరేంద్రకుమార్‌రెడ్డి, నాయకులు హులెప్ప, బాబు, రామలింగేశ్వరయాదవ్, మురళీ, రాముడు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం


హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి

కోసిగి: మండలంలోని దుద్ది, కొల్మాన్‌పేట గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం శ్రీ రామలింగేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవీ ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ఆలయ ధర్మకర్త గుడిసె రామలింగప్ప, ఆదోని రాజయోగి పంచలింగేశ్వర స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. స్వామి వారికి జలాభిషేకం, మహా రుద్రాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఆకు పూజ, గణపతి, గాయత్రీ, నవగ్రహ, రుద్ర, లలితా హోమాలు వేదమంత్రోచ్చారణల మధ్య జరిగాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ


ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని కంబలదిన్నె గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి, శివపార్వతుల విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. బుదవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు గంగపూజ, బిల్వపూజ, గోపూజ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శ్రీమద్విరాట్ వీర బ్రహ్మేంద్రస్వామి కుమార్తె వీరనారాయణమ్మ వంశీకులు 7వ తరం పీఠాధిపతులు వెంకటాద్రిస్వామి దంపతులు ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి భజన పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి.

వైభవం.. రంగస్వామి తాత రథోత్సవం


రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో రంగస్వామి తాత రథోత్సవం బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రభోత్సవం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ వీధుల్లో రథోత్సవాన్ని కడు రమణీయంగా నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎర్ర బంగారమే..



చిప్పగిరి మండలం వివిధ గ్రామాల ఆయకట్టు రైతులకు హెచ్చెల్సీ, బోరు బావుల రైతులు వివిధ రకాల మిర్చి పంటను సాగుచేశారు. రెండ్రోజు నుంచి ఎండ వేడిమి శాతం పెరిగింది. చిప్పగిరి మండల కేంద్రానికి చెందని రైతు మహేష్ తన 15 ఎకరాలల్లో సాగు చేసిన గుంటూరు రంకం మిర్చి పంటను కుప్ప నూర్చి తేమ శాతాన్ని తగ్గించేందుకు పొలంలో ఆరబోశాడు. అటువైపుగా కాస్త దూరం నుంచి వెళ్లేవారికి ఈ దృశ్యం ఎర్రనేలనా అనేంత భ్రమ కలుగుతోంది.

– ఆలూరు

కోడి కూతకు ముందే పింఛన్ల పంపిణీ


ఎస్కేడీ కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్

ఆదోని టౌన్ : కోడి కూయడాని కంటే ముందుగానే వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో బుధవారం పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగింది. సాయంత్రం 5 గంటల సమయానికి 93 శాతం పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో 16,773 మంది పింఛన్‌దారులకు రూ.4,68,82,000 నగదును పంపిణీ చేశారు.

కౌతాళంలో..

కౌతాళం: అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నామని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం కావడంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలో 8,513 మందికి గాను మండలానికి రూ.2.35 కోట్ల వచ్చినట్లు చెప్పారు. బ్యాంకులో డబ్బులు డ్రాలో కొంత ఆలస్యం కావడంతో మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రారంభించామని అయినా 30శాతం లబ్ధిదారులకు నగదు అందజేశామని పేర్కొన్నారు.